క్లుప్తంగా

రాయితీపై డ్రిప్ పరికరాలు

చౌడేపల్లె: రాయితీపై అందించే డ్రిప్ సామగ్రి కోసం ఆసక్తిగల వారు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని హార్టికల్చర్ ఆఫీసర్ సంతోషికుమారి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ 70శాతం నుంచి 90శాతం వరకు సబ్సిడీపై అందించే పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రిటైర్డ్ టీచర్‌కు సన్మానం



వెంకటేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కుప్పం: మండల పరిధిలోని గుడ్లనాయనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన వెంకటేష్‌ను ఘనంగా సన్మానించారు. ఆదివారం మండలం పరిషత్ కార్యాలయంలో సన్మాన సభను నిర్వహించారు. మండల పరిధిలోని ఉపాధ్యాయులు కలసి వెంకటేష్‌ను సన్మానించారు. 30 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో వెంకటేష్ చేసిన సేవలను కొనియాడారు. ఎంపీడీఓ ఖాదర్ బాషా పాల్గొన్నారు.

వి.కోట తహసీల్దార్‌గా పార్వతి



వి.కోట: వి.కోట మండల తహసీల్దార్‌గా పార్వతి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న సురేష్‌కుమార్ తహసీల్దార్ బదిలీపై అనంతపురం వెళ్లారు. దీంతో కర్నూల్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న పార్వతికి వి.కోట తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఈమేరకు నూతన తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తానన్నారు.

చౌడేశ్వరీదేవి జయంతోత్సవాలు



ప్రత్యేకాలంకారంలో చౌడేశ్వరీదేవి

సదుం: మండలంలోని మొరవమీదపల్లె చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం ఘనంగా జయంతోత్సవాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విశేష అలంకారంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. నిర్వాహకులు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో సైతం విశేష పూజలు జరిపించారు.

బాధ్యతల స్వీకరణ

- బైరెడ్డిపల్లె తహసీల్దార్‌గా మాధవరావు



మాధవరావును సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె తహసీల్దార్‌గా ఆదివారం మాధవరావు బాధ్యతలు స్వీకరించారు. విజయపురంలో విధులు నిర్వహిస్తున్న ఆయన్ను ప్రభుత్వం బైరెడ్డిపల్లె తహసీల్దార్‌గా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. విధి నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈసందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయన్ను ఘనంగా సత్కరించారు.

సమస్యల పరిష్కారానికి పెద్దపీట



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

పలమనేరు: సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమరనాథరెడ్డిని ఆదివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆదరించారు కాబట్టి వారి ఆశలను తమ ప్రభుత్వం తప్పక నెరవేరుస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయ అభివృద్ధిలో కిరణ్‌కుమార్‌రెడ్డి సాయాన్ని ఎన్నటికీ మరువలేమన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నేడు ధర్నా

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు పునఃసమీక్షించాలని కోరుతూ సోమవారం అన్నమయ్య జిల్లా సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఆర్ అశోక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాలమహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు ప్రారంభించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో శ్రీనివాసులు, నాగరాజా, రమేష్, ఆనంద, రెడ్డెప్ప, ఈశ్వర్, శీన పాల్గొన్నారు.

నిర్వాహకులు పెట్టిందే భోజనం

- భోజన నిర్వాహకులకు రెండు నెలలుగా అందని వేతనాలు
- మిడ్ డే మీల్స్ బిల్లులు పెండింగ్
- పట్టి పీడిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- సర్కారు బడులపై నిర్లక్ష్యం చూపుతున్న కూటమి ప్రభుత్వం



పలమనేరు బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

పలమనేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. మనబడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేసింది. తల్లిదండ్రులు వారి పిల్లలను సర్కారు బడికే పంపేలా చేసింది. విద్యార్థులు సైతం తాము ప్రభుత్వ బడిలోనే చదువుకుంటామనే భావనను తీసుకొచ్చింది. గత విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు సైతం గణనీయంగా పెరిగాయి. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నాడు–నేడు పనులకు సంబంధించి, మధ్యాహ్న భోజనం బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. భోజన నిర్వాహకుల వేతనాలు సైతం సకాలంలో రావడం లేదు. ఇక స్టూడెంట్ కిట్లు సైతం పూర్తి స్థాయిలో అందలేదు. దీంతో పాటు ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది.

ఇదిగో సాక్ష్యం....

పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి హైస్కూల్‌లో 600మంది పిల్లలు ఉన్నారు. ఈ బడికి సంబంధించి మిడ్ డే మీల్స్ బిల్లులు నెలకు రూ.80వేల చొప్పున రెండు నెలలకు రూ.1.60లక్షలు బకాయిలు ఉన్నాయి. వంట నిర్వాహకులకు నెలకు రూ.9వేల చొప్పున నెలకు రూ.27 వేలు ఇంకా వేతనాలు పడలేదు. దీంతో వంట నిర్వాహకులే అప్పులు చేసి వంట సామగ్రిని తెచ్చి పిల్లలకు భోజనం వడ్డిస్తున్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో వెయ్యి మంది దాకా పిల్లలున్నారు. ఇక్కడా ఇదే సమస్య. మిడ్ డే మీల్స్‌కు సంబంధించి నిర్వాహకులు బాధలు పడి పిల్లలకు వంట వండాల్సిందే. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 670 మందికి ముందుగా సరుకులు తెచ్చి ఆపై వంట వండి పెట్టాలి. ఇదే పరిస్థితి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొంది.

ఇంటి నుంచి అన్నం బాక్స్‌లు..

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థులు ఇళ్ల నుంచే బాక్స్‌లు తెచ్చుకుని పాఠశాలలో భోజనం చేస్తున్నారు. ఎందుకంటే బడిలోని భోజనం పెద్ద రుచికరంగా లేకపోవడమే కారణంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వంలో ఉన్న నాణ్యత, మెనూ అమలు ఇప్పుడు లేదని పలువురు విద్యార్థులు తెలిపారు. మధ్యాహ్న భోజనానికి నిధులు సక్రమంగా అందకపోవడంతో నిర్వాహకులపై ఉపాధ్యాయుల పర్యవేక్షణ కొరవడింది. వారిని గట్టిగా ప్రశ్నిస్తే తమకు బిల్లులు ఆలస్యమవుతున్నందున ఏదో మా బాధపడుతున్నామని చెబుతున్నారు. దీంతో వారు ఏం చేయలేకపోతున్నారు.

యూనిఫామ్‌లు లేవే...

నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలం కడపనత్తం హైస్కూల్‌లో 400 మంది దాకా పిల్లలున్నారు. వీరికి యూనిఫామ్ అందక ఇప్పటికీ అన్ యూనిఫామ్‌తోనే బడికి వెళుతున్నారు. దీనిపై అక్కడి టీచర్లను అడిగితే స్టూడెంట్ కిట్లు అందింతేకదా ఇవ్వడానికి అని చెబుతున్నారు. కిట్లు ఇంకా 20 శాతం అందాల్సి ఉంది. ముఖ్యంగా పుస్తకాలు, షూలు, యూనిఫామ్‌లు రావాల్సి ఉంది. కొన్ని అన్‌సైజుల కారణంగా ఇప్పటికీ యూనిఫామ్స్ అందలేదు.

పట్టి పీడిస్తున్న టీచర్ల కొరత..

నియోజకర్గంలో ఇంకా వంద పోస్టుల అవసరం ఉంది. వి.కోట మండలంలోని కొమ్మరిమొడుగులో 1 నుంచి ఏడు తరగతులకు నలుగురే టీచర్లున్నారు. 12 పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడే దిక్కుగా మారింది. హైస్కూళ్లలో సైతం టీచర్ల కొరత కారణంగా కంబైన్డ్ క్లాసులు జరిపించాల్సిన అవసరం నెలకొంది. మొత్తం మీద కూటమి ప్రభుత్వం బడులపై నిర్లక్ష్యం చేస్తోందనే మాట సర్వత్రా వినిపిస్తోంది.

పలమనేరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు	
ప్రైమరీ, యూపీ, హైస్కూళ్ల మొత్తం	469
గురుకుల పాఠశాల	01
ఎస్సీ గురుకుల పాఠశాల	02
ఎయిడెడ్	02
కస్తూరిభా పాఠశాలలు	02
అన్ని పాఠశాలల్లోని విద్యార్థులు	52,200
ప్రస్తుతం ఉపాధ్యాయుల సంఖ్య	1620
ఉండాల్సిన ఉపాధ్యాయుల సంఖ్య	1720

పుంగనూరు నియోజకవర్గ వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు	315
ప్రాథమికోన్నత పాఠశాలలు	53
ఉన్నత పాఠశాలలు	48
మొత్తం పాఠశాలలు	416
ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు	8,465
ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు	6,789
ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు	11,895
తెలుగు మీడియం విద్యార్థులు	15,165
ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు	10,653
ఉర్దూ మీడియం విద్యార్థులు	1331

కుప్పంలో అధ్వానం

- విద్యా శాఖను వేధిస్తున్న ఖాళీలు
- 376 టీచర్స్ పోస్టులు ఖాళీ
- మధ్యాహ్న భోజనంలో కొరవడుతున్న నాణ్యత

కుప్పం: విద్యా కేంద్రంగా కుప్పంను తీర్చిదిద్దుతామని ప్రతి పర్యటనలో ప్రకటనలు చేస్తున్న చంద్రబాబు స్వంత నియోజకవర్గంలో ప్రభుత్వం పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్ర స్థాయికి చేరుకోవడంతో విద్యార్థులు చదువులు కుంటుపడ్డాయి. దీంతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యత కొరవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కుప్పం నియోజకవర్గంలో విద్యా వ్యవస్థ అధ్వానంగా మారింది..

376 టీచర్ పోస్టులు ఖాళీ

నియోజకవర్గంలోని 432 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలో 376 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కుప్పం మండలంలో అధికంగా 124, రామకుప్పం మండలంలో 117, శాంతిపురం 90 , గుడుపల్లె 45 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. పట్టణంలోని బాలురు ఉన్నత పాఠశాలలో 550 మంది విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. ఈ పాఠశాలలో 9 మంది ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయుల కొరత తీవ్రం కావడంతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

నాణ్యత కొరవడిన మధ్యాహ్న భోజనం

నియోజకరవ్గంలోని ప్రభుత్వం పాఠవాలలో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్నం భోజనంలో నాణ్యత కొరవడిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం బోజనాలు పెట్టడం లేదని విమర్శలు వినపిస్తున్నాయి.

కిట్లు కొంత అందాల్సి ఉంది...



నియోజకవర్గంలోనే ఎక్కువ మంది ఉన్న బడి ఇది. స్టూడెంట్‌కిట్లు మరికొంత అందాల్సి ఉంది. ఇక వంట నిర్వాహకులు రెండు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులు వస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వ నిధుల ఆలస్యంతోనే ఇబ్బందిగా మారింది.

–లత, హెచ్‌ఎం, బాలికోన్నత పాఠశాల, పలమనేరు

పాఠశాల కమిటీ ఎన్నికలయ్యాక వస్తాయేమో....



స్టూడెంట్‌కిట్లు 90శాతం అందాయి. మిగిలినవి రావాల్సి ఉంది. ఈనెల 8న పాఠశాల కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈప్రక్రియ పూర్తయ్యాక ఈ ప్రభుత్వం కిట్లు విడుదల చేస్తుందేమో చూడాలి.

–లీలారాణి, ఎంఈఓ, పలమనేరు

జగనన్న పాలనలోనే బాగుండె..



జగనన్న ప్రభుత్వంలో మా బిడ్డల చదువుకోవడానికి ఏనాడు ఇబ్బంది పడలేదు. ఇప్పుడు అమ్మఒడి బదులు తల్లికి వందనం లేదు. విద్యాసామగ్రి ఇంకా పూర్తిగా అందలేదు. ఈమధ్య బుక్‌స్టాల్‌లో పిల్లలకు బుక్కులు, నోట్సులు తీసిచ్చా. ముందులాగే ఉంటుందని అనుకున్నా, ఇప్పుడు చూస్తా ఉంటే ఎంత పొరబాటైందోనని బాధేస్తోంది.

–రాణెమ్మ, ఎస్టీకాలనీ, పలమనేరు మండలం

విద్యార్థులకు తెలుగు భాషా పోటీలు

పలమనేరు: రానున్న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు జాతీయస్థాయి తెలుగుభాషా పోటీలను నిర్వహించనున్నట్టు సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6, 7 తరగతులకు తెలుగుభాష గొప్పతనం, 8 నుంచి 10 తరగతుల వారికి నేటి తెలుగుభాష దుస్థితి అనే అంశంపై మూడు పేజీలకు మించకుండా వ్యాసం రాసి ఈనెల 15లోపు తులసీనాథం నాయుడు, కళా మందిరం, సాయిగార్డెన్ సిటీ, గంగవరం అనే చిరునామాకు పోస్టాఫీస్ ద్వారా మాత్రమే పంపాలని సూచించారు. వందకుపైగా నీతి పద్యాలను చెప్పే వారికి ప్రత్యేక బహుమతులుంటాయని అందులో పేర్కొన్నారు. వివరాల కోసం 9553429770 అనే నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరిదేవి



విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు: ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని చదళ్ల గ్రామంలో శ్రీచౌడేశ్వరీ దేవికి విశేష పూజలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి సన్నిధిలో నెయ్యిదీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మారెమ్మ ఆలయంలో..

పట్టణంలోని బస్టాండ్ వద్ద వెలసిన శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని నల్లరంగుతో అలంకరించి నిమ్మకాయలు, గుమ్మడికాయలు పెట్టి పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఎదుట నెయ్యిదీపాలు వెలిగించి, చలిపిండి, పెరుగన్నం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కుక్కల స్వైర విహారం



రాయలపేటలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

పెద్దపంజాణి: మండలంలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తూ స్వైరవిహారం చేస్తున్నాయి. వీటి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాయలపేట, కోగిలేరు, పెద్దపంజాణి, శంకర్రాయలపేట, ముత్తుకూరు, పెద్దవెలగటూరు, బట్టందొడ్డి, అప్పినపల్లి, రాజుపల్లి, లింగాపురం ప్రాంతాలలో వీటి సంచారం ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాలలో చికెన్ షాపులు, కోళ్లఫారాలు ఎక్కువగా ఉండడంతో చనిపోయిన కోళ్ల వ్యర్థాల కోసం అవి ఎగబడుతున్నాయి. రాత్రి అయిందంటే చాలు రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ తమ విశ్వరూపాన్ని చూపిస్తున్నాయి. జనాలు రోడ్డుపై నడవాలంటే భయపడిపోతున్నారు. ద్విచక్ర వాహనదారులను సైతం కుక్కలు వెంటాడి దాడిచేస్తున్నాయి. భయంతో వాహనాలు అదుపుతప్పి గాయాల పాలవుతున్నారు. కుక్కల సంతానోత్పత్తి లేకుండా చేపట్టాల్సిన అధికారులు చర్యలు అటకెక్కాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెస్కోలో అభివృద్ధి పనులకు ప్రణాళిక

- ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు



మాట్లాడుతున్న ఎస్‌ఈ సురేంద్రనాయుడు

కుప్పం: రెస్కో పరిధిలో పలు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆదివారం కడ కార్యాలయంలో రెస్కో, ట్రాన్స్‌కో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడానికి మూడేళ్లలో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రణాళిక రూపొందించామన్నారు. అందులో భాగంగా కొత్తగా సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు సామర్థ్యం పెంచనున్నట్లు వివరించారు. ఈఈ శ్రీనివాసమూర్తి, డీఈ చిన్నబ్బ పాల్గొన్నారు.

నేడు పుంగనూరులో మంత్రి రాంప్రసాద్ రెడ్డి పర్యటన

పుంగనూరు: రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం ఉదయం పుంగనూరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో అధికారులు, పార్టీ క్యాడర్‌తో సమావేశం నిర్వహించనున్నారు.


కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



శస్త్రచికిత్సకు ఎంపికైన వారితో వైద్యులు

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మహతీ ఫౌండేషన్ వారి సహకారంతో కుప్పం పీఈఎస్ వైద్యాధికారులచే నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో కుప్పం పీఈఎస్ వైద్యులు 58 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో ఆరుగురిని శస్త్రచికిత్స కోసం ఎంపిక చేశారు. కుప్పం పీఈఎస్ వైద్యులు చైతన్య, చైత్ర, గాయత్రి, మహతీ ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు యోగా



మాట్లాడుతున్న సిస్టర్ జయంతి

పలమనేరు: మానసిక ప్రశాంతతకు యోగాను మించిన సాధనం లేదని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బోధకులు జయంతి సూచించారు. పట్టణ సమీపంలోని మొగిలి ఆశ్రమంలో నిర్వాహకులు బాలమురళి ఆధ్వర్యంలో ఆదివారం రక్షాబంధన్ కార్యక్రమం జరిగింది. ఇందులో వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. పాకాల విమల, మొగిలి రాధిక, నాగార్జున, చందన, జ్యోతి పాల్గొన్నారు.

వైభవంగా అమావాస్య పూజలు



విశేష అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె బాట గంగమ్మ ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతినెలా అమావాస్య రోజున ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుండడం ఆనవాయితీ. నిర్వాహకులు ఏర్పాటు చేసిన కేరళ డ్రమ్స్ స్థానికులను ఆకట్టుకుంది. అలాగే బైరెడ్డిపల్లె నడివీధి గంగమ్మకు మహిళలు 108 బిందెలతో జలాభిషేకం చేపట్టి వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



అపూర్వ సమ్మేళనం

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలో 1974 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా తమ బ్యాచ్ గోల్డెన్ జూబ్లీ సంబరాలు జరుపుకున్నారు. నాటి గురువులు రాఘవరెడ్డి, రామచంద్రారెడ్డి, జ్ఞానప్రసూనాంబిక, శివలక్ష్మమ్మను ఘనంగా సన్మానించారు. స్నేహితులందరికీ జ్ఞాపికలు పంపిణీ చేశారు. ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. కార్యక్రమంలో ఇనయతుల్లా, సొప్పర చంద్రశేఖర్, మహమ్మదాలీ, నాగభూషణం, జనార్ధనరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రుక్మాంగద, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

భగవద్గీత గొప్పతనాన్ని తెలుసుకోవాలి



భగవద్గీతపై ప్రచారంలో నిర్వాహకులు

పలమనేరు: భగవద్గీత చదవడం పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని, దాని గొప్పతనాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని, గీతను చదవడం ఓ బాధ్యతగా భావించాలని స్థానిక త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవాసమితి నిర్వాహకులు భాస్కర్ సూచించారు. ఆమేరకు మండలంలోని నక్కపల్లిలో ఆదివారం గీతపై వారు ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. బాలాజీ, వాణిశ్రీ, జ్యోతి పాల్గొన్నారు.

పేదల సేవకే లయన్స్ క్లబ్



వస్తువులు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

పుంగనూరు: పేద ప్రజలకు విశేష సేవలందించేందుకే లయన్స్ క్లబ్ నిరంతరం కృషిచేస్తోందని క్లబ్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ పి.శివ తెలిపారు. ఆదివారం సాయంత్రం క్లబ్ కార్యాలయంలో బెంగళూరుకు చెందిన క్లబ్ మాజీ గవర్నర్ భక్తవత్సలరెడ్డి, జోన్ చైర్మన్ సుబ్బారెడ్డి, అరుణ్‌కుమార్, గోపీకృష్ణలతో కలసి పేదలకు కుట్టుమిషన్లు, గొడుగులు, విద్యార్థులకు బెడ్‌షీట్లు, ఆస్పత్రికి డయాలసిస్ మిషన్, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు పంపిణీ చేశారు. అలాగే పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. డాక్టర్ శివ మాట్లాడుతూ క్లబ్ ద్వారా రూ.5 లక్షల విలువ చేసే వస్తువులను 125 మందికి పంపిణీ చేశామని వెల్లడించారు. అలాగే ప్రజారోగ్య రక్షణకు వైద్యశిబిరాలు, మూగజీవుల కోసం పశువైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని వివరించారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి, ప్రతినిధులు గోపాలకృష్ణ, వరదారెడ్డి, మహిపాల్ రెడ్డి, రాజారెడ్డి, రఘుపతి, సురేష్, రిజ్వి, మహేంద్రరావు, సుధాకర్, వేణుగోపాల్, సీవీ రెడ్డిప్రసాద్, జి.వేణుగోపాల్, ఎస్‌ఆర్.సతీష్‌కుమార్, పి.మల్లికార్జునరెడ్డి, జి.రవికుమార్ పాల్గొన్నారు.





పాఠశాలకు వంట పాత్రలు పంపిణీ చేస్తున్న సభ్యులు, బాలింతలకు బేబీ కీట్ల పంపిణీ

వంట పాత్రల వితరణ

వి.కోట: లయన్స్ క్లబ్ వి.కోట మండల అధ్యక్షుల ఎంపిక జరిగింది. ఇందులో 2024–25 సంవత్సరానికి గాను సంస్థ మండలాధ్యక్షుడిగా ధీరజ్‌ను, కార్యదర్శిగా మురుగేష్, కోశాధికారిగా లక్ష్మణ్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనతరం వారి చేత సంస్థ గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నియమితులైన నూతన కమిటీ మొదటి సేవగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలకు రూ.50వేల విలువ చేసే వంట పాత్రలను వితరణగా అందజేశారు. అలాగే సీహెచ్‌సీలో బాలింతలకు బేబీకిట్లు, పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థకు నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు ధీరజ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. లోకేష్, డాక్టర్ తమీమ్, బీవీ తుకారాం, శబరీష్, నాగభూషణం, సురేంద్రగౌడ, రమేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.